క్లుప్తంగా

విద్యార్థులు ఇష్టంగా చదవాలి



చాకిచర్లలో చదవడం మాకిష్టం కార్యక్రమం

ఉలవపాడు: విద్యార్థులు పుస్తకాలను ఇష్టంగా చదవాలని ఉలవపాడు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఉలవపాడు గ్రంథాలయం. దానికి అనుబంధంగా నడిచే చాకిచర్ల బీడీసీఎల్‌లో జరుగుతున్న చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులకు ఆయన పలు సూచనలు సలహాలు అందించారు. గ్రంథాలయాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని తెలిపారు. గ్రంథాలయాలలో ఉన్న పుస్తకాలను ఇష్టంగా చదివి జ్ఞానం సంపాదించుకోవాలన్నారు. విద్యార్థులతో నీతి కథలు, మహనీయుల చరిత్రలు చదివించారు.

ముగిసిన పీర్ల పండుగ వేడుకలు



సీఎస్‌పురంలో పీర్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న ముస్లింలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలో పీర్ల చావిళ్ల వద్ద వారం రోజులుగా నిర్వహిస్తున్న పీర్లపండుగ వేడుకలు ఆదివారం పీర్ల స్నానంతో ముగిశాయి. ఈ సందర్భంగా పీర్ల చావిళ్ల ఉన్న పీర్లకు ముజావర్‌లు, హిందూ, ముస్లింలు పూజలు చేశారు. వేకువజామున పీర్లు గుండం దూకే కార్యక్రమం నిర్వహించగా సాయంత్రం సమయంలో గుండం పూడ్చి మొక్కులు నాటి అక్కడ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పీర్లను అందంగా అలంకరించి ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో హిందూ, ముస్లింలు అధికసంఖ్యలో పాల్గొనగా పీర్ల స్నానంతో మొహరం వేడుకలు ముగిశాయి. కార్యక్రమంలో ముజావర్లు హిందూ, ముస్లింలు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లకు ఎన్నికల విధుల బకాయిలివ్వాలి



తూర్పునాయుడుపాలెంలో మంత్రికి వినతి పత్రం అందిస్తున్న ఫొటోగ్రాఫర్లు

టంగుటూరు: కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎన్నికల సమయంలో విధులు నిర్వర్తించిన ఫొటోగ్రాఫర్లకు బకాయిలు ఇప్పించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని ఫొటోగ్రాఫర్లు కోరారు. ఈ మేరకు ఆదివారం తూర్పునాయుడుపాలెంలో మంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. 60 రోజులపాటు వాహన తనిఖీల వీడియోలు చిత్రీకరించామని, అలాగే ఎన్నికల రోజున కూడా ప్రతి పోలింగ్ కేంద్రంలో వీడియోలు తీసి అధికారులకు సమర్పించామని చెప్పారు. అడ్వాన్సుగా రూ.25 వేలు మాత్రమే అందించారని, మిగిలిన బకాయిలు చెల్లించాలని అడిగితే తహసీల్దార్ కాలయాపన చేస్తున్నారని వాపోయారు. బకాయిలు త్వరగా ఇప్పించి ఆదుకోవాలని మంత్రిని వేడుకున్నారు.

నూతన బస్సులు ప్రారంభం



నూతన బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి రూరల్: కనిగిరి ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదివారం నూతనంగా 5 కొత్త బస్సులను, నూతన సర్వీసును ఎమ్మెల్యే ఉగ్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు. అలాగే ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే నూతన పెట్రోల్ బంక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఎం బి. సుధాకర్, ఆర్టీసీ డీఎం శ్రీమన్నారాయణ, టీడీపీ నాయకులు తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, ఎస్‌కే జంషీర్, దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, ఎస్‌కే అహమ్మద్, ఎస్‌కే ఫిరోజ్, జానీ, సుబ్బారావు, సురేంద్రారెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్రకు ఎన్ఎంయూ ఆధ్వర్యంలో డిపోలోని సమస్యలు పరిష్కారించాలని వినతి పత్రం అందచేశారు. తాగు నీటి వసతి కల్పించాలని, గ్యారేజ్‌లో అంతర్గత సీసీ రోడ్డు నిర్మించాలని, డిపో ఆవరణలో చెత్త డంపింగ్ పాయింట్‌ను లేకుండా చేయాలని, నూతన సర్వీసులు, బస్సులు కావాలని వినతి పత్రంలో కోరారు. నాయకులు నజీర్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఎవరూ రాక..!

- ఏడాది కాలంగా కందుకూరు తహసీల్దార్ పోస్టు ఖాళీ
- కీలకమైన డివిజన్, నియోజకవర్గ కేంద్రంలో తహసీల్దార్ లేకపోవడంతో పలు ఇబ్బందులు
- ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొనసాగుతున్న ఉలవపాడు తహసీల్దార్



కందుకూరు తహసీల్దార్ కార్యాలయం

కందుకూరు: ఓ వైపు డివిజన్ కేంద్రం, మరోవైపు నియోజకవర్గ కేంద్రం ఇలా కీలకమైన కందుకూరులో తహసీల్దార్ పోస్టు ఏడాది కాలంగా ఖాళీగా ఉంది. ప్రభుత్వ పరిపాలన కార్యక్రమాలతో, ప్రజలకు సంబంధించి ప్రతి కార్యక్రమం తహసీల్దార్‌తోనే ముడిపడింది. ఏ పత్రం కావాలన్నా ముందుగా వెళ్లాల్సింది తహసీల్దార్ కార్యాలయానికే. అటువంటి కీలకమైన తహసీల్దార్ పోస్టులో గత ఏడాదిగా ఎవరూ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉలవపాడు తహసీల్దార్ బ్రహ్మయ్య కొనసాగుతున్నా ఆయన రెండు చోట్ల విధులు నిర్వర్తించాల్సి ఉండడంతో కార్యాలయానికి ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో కూడా అర్థం కాని పరిస్థితి. దీంతో ప్రజలు పనుల కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది

అలా వచ్చి ఇలా వెళ్లిపోయారు..

నియోజకవర్గ కేంద్రమైన కందుకూరులో తహసీల్దార్‌గా పనిచేసేందుకు ఏడాది కాలంగా ఎవరూ ముందుకు రావడం లేదు. సీతారామయ్య అనే తహసీల్దార్ దాదాపు మూడేళ్లపాడు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు. ఆ తరువాత ఏడాది క్రితం ఆయన ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లారు. ఆ తరువాత మరో ఇద్దరు తహసీల్దార్‌ను ఇక్కడ నియమించినా వారు కనీసం కార్యాలయానికి కూడా రాలేదు. కందుకూరులో తహసీల్దార్ పోస్టులో చేరేందుకు వారు ససేమిరా అని అటు నుంచి అటే వెళ్లారు. ఆ తరువాత మధ్యలో పరమేశ్వరరెడ్డి అనే తహసీల్దార్ రెండు నెలలు పనిచేసినా ఆయన బదిలీ చేయించుకుని వెళ్లిపోయారు. ఇక అప్పటి నుంచి కందుకూరు తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ విధులు నిర్వర్తించేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. ఈ లోగా ఎన్నికలు రావడం, అధికారుల బదిలీలు నిలిచిపోవడం మరో అధికారి వచ్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో దాదాపు ఏడాది కాలం నుంచి ఉలవపాడు మండల తహసీల్దార్ చంద్రారెడ్డి ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించి నెట్టుకొస్తున్నారు. 2024 సాధారణ ఎన్నికలను కూడా ఇన్‌చార్జి తహసీల్దార్‌తోనే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇన్‌చార్జి తహసీల్దార్ కావడంతో ఆయన వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే ఇక్కడ ఉంటారు. ఆయన ఎప్పుడు ఇక్కడికి వస్తారో, ఎప్పుడు వెళ్తారో కూడా తెలియని పరిస్థితి. నియోజకవర్గ కేంద్రంలో రెవెన్యూ సమస్యలపై వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా విద్యా సంవత్సరం ప్రారంభంలో వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చే వారు. భూమి సమస్యలపై వచ్చే రైతులు, సర్వేలు ఇలా ఏ సమస్య పరిష్కరించుకోవాలన్నా తహసీల్దార్‌తోనే పని. కానీ ఆ పోస్టులో రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ప్రజలు కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో నూతన తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో కందుకూరు తహసీల్దార్ పోస్టు కోసం పోటీపడే రెవెన్యూ అధికారులు ప్రస్తుతం ఇక్కడికి వచ్చేందుకు ససేమిరా అనే పరిస్థితి వచ్చింది. దీనికి ప్రధానంగా డివిజన్, నియోజకవర్గ కేంద్రం కావడం వల్ల ప్రోటోకాల్ విధులతో పాటు, జిల్లాల మార్పిడి తరువాత నెల్లూరు జిల్లాలో చివరి ప్రాంతంగా మారింది. దీంతో జిల్లా కేంద్రానికి దూరం కావడం వల్ల తరచూ మీటింగ్‌లు అంటే రానుపోనే ఒక రోజు సరిపోతుందంటూ కొందరు అధికారులు ఇక్కడికి వచ్చేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కందుకూరుకు రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించేందుకు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బత్తినను పరామర్శిస్తున్న మాజీ మంత్రి సురేష్

బత్తినకు మాజీ మంత్రి సురేష్ పరామర్శ

జరుగుమల్లి(సింగరాయకొండ): వైఎస్సార్ సీపీ జరుగుమల్లి మండల అధ్యక్షుడు బత్తిన మదన మనోహరరావును ఆదివారం ఆయన నివాసంలో మాజీ మంత్రి, పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బత్తిన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను మాజీ మంత్రి సురేష్ పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఉచిత ఇసుక పాలసీ అమలు తీరుపై స్థానిక నాయకుల వద్ద ఆరా తీశారు. ఆయన వెంట పార్టీ నేతలు పిన్నిక శ్రీనివాసరావు, దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, పాడిబండ్ల నాగేశ్వరరావు, సర్పంచ్ కె.పున్నారావు, పాలడుగు జగదీష్, కొమ్మాలపాటి మధుసూధనరావు, చుండి శ్రీనివాసరావు, పుట్టా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు చెన్నయ్య



విద్యార్థులకు నోట్ బుక్‌లు అందచేస్తున్న చైర్మన్ గఫార్, సయ్యద్ యాసీన్

కనిగిరి రూరల్: చిరస్మరణీయుడు దివంగత కోమటిగుంట్ల చెన్నయ్య అని పలువురు వక్తలు అన్నారు. థెరిస్సా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కోమటి గుంట్ల చెన్నయ్య ద్వితీయ వర్ధంతిని ఆదివారం కనిగిరిలో నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్, సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ కనిగిరి ప్రజల హృదయాల్లో పేదల డాక్టర్ చెన్నయ్యగా చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. దాతలు వాగిచర్ల వెంకటేశ్వర్లు, కోమటిగుంట్ల శ్రీను, బేరి భాస్కర్‌రెడ్డిల ఆర్థిక సౌజన్యంతో సుమారు రూ.18 వేల విలువైన పుస్తకాలను పాఠశాల, కళాశాలల విద్యార్థులకు అందచేశారు. మదర్ థెరిస్సా సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ నాయబ్ రసూల్, పసుపులేటి అరుణోదర్, ఇస్కాన్ కేంద్ర కమిటీ సభ్యుడు గుత్తి శ్రీధర్, మాజీ కోఆప్షన్ సభ్యులు పీర్ల మస్తాన్ వలి, పచ్చవ శేఖర్, ద్రోణాదుల చెంచులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



జమ్ములపాలెంలో ప్రత్యేక అలంకరణలో బాబా



బాబాగుడిలో గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

పామూరు: మండలంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక దేవాలయం వీధిలోని పోస్టాఫీస్‌వద్ద ఉన్న సాయిబాబా, వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉన్న సాయిబాబా ఆలయాల్లో అర్చకులు వేదమంత్రాలతో బాబా మూలవిగ్రహమూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం సాయినాథుని ఉత్సవమూర్తికి పుష్పార్చన నిర్వహించారు. మదన వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. సాయంత్రవేళ సాయినాథుని ఉత్సమూర్తికి ఊంజల్‌సేవ నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ పబ్బతి వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో కేసీపీ సిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఇందిరాదత్తు ఆర్థిక సాయంతో 3 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. సోమిశెట్టి మాల్యాద్రి, మిరియం రామారావు, పబ్బతి తిరుపతయ్య, భక్తులు పాల్గొన్నారు.

ఉలవపాడు: గురుపౌర్ణమి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని సాయిబాబా ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. ఉలవపాడులోని సాయిబాబా మందిరం, రాజుపాలెం రత్నసాయి సురక్షిత మందిరం, కరేడు, మన్నేటికోటలోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు కాగడహారతి, 7 గంటలకు పాలాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వెలిగండ్ల: మండలంలోని మొగళ్లూరు, వెలిగండ్ల, రామగోపాలపురం గ్రామాల్లోని దేవస్థానాల్లో గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొగళ్లూరు షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం కాగడ హారతి, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, శాశ్వత ఉభయదాతలకు సామూహిక పూజలు, హారతి అనంతరం అన్నప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం సంధ్యాహారతి, భజన నిర్వహించారు. రామగోపాలపురం సాయిబాబా మందిరంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కోలాటం నిర్వహించారు.

తీరంలో భక్తుల సందడి

ఉలవపాడు: మండల పరిధిలోని రామాయపట్నం తీరంలో భక్తుల సందడి కనిపించింది. గురుపౌర్ణమి పర్వదినం కావడంతో భక్తులు, పర్యాటకులు సముద్రస్నానానికి భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచే సముద్రతీరానికి భక్తులు తరలివచ్చి సముద్రస్నానమాచరించారు. రామాయపట్నం పల్లెపాలెం బీచ్, గెస్ట్ హౌస్ బీచ్ రెండు ప్రాంతాల్లో భక్తులు తరలివచ్చారు. అక్కడ కొలుపులు నిర్వహించారు.

కనిగిరి రూరల్: పట్టణంలోని పలు ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక సాయిబాబా దేవస్థానంలో గురు పౌర్ణమి సందర్భంగా కాగడ హారతి, అభిషేకాలు, ప్రత్యేక సామూహిక పూజలు, పుష్పాభిషేకం, విశిష్ట పూజలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే గఫార్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మారావు టంగుటూరి గోవిందరావు, ఏసీ చెంచులు, విసి రామశాస్త్రి, వాగిచర్ల వెంకటేశ్వర్లు, బద్వేటి కృష్ణమూర్తి, పల్లా మాలకొండ్రాయుడు, ఆర్ సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు. నందనమారెళ్ల బాలకోటేశ్వరి సహితా బాలకోటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో 13 మంది వేదపండితులతో ఏకాదశ రుద్రాభిషేకం, సుందర కాండ పారాయణం, చండి పారాయణం, చండీ హోమం, అరుణ హోమం, విరాట్ పర్వపారాయణం, సుదర్శన, నారసింహ హోమం నిర్వహించారు. దేవాంగనగర్‌లో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో వ్యాస పున్నమి, గురుపౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొండూరి కృష్ణమూర్తి దంపతులను, ఇనుగూరి సుబ్బారావులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

ఘనంగా గురుపూర్ణిమ వేడుకలు

సింగరాయకొండ: మండలంలోని ఆలయాల్లో ఆదివారం గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక షిరిడీ సాయిమందిర్‌లో సాయిబాబా విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు కొల్లూరి సత్యన్నారాయణ ఆధ్వర్యంలో భక్తులకు జీవీఆర్ ఆక్వా కంపెనీ సహకారంతో అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పాకల, శానంపూడి, బింగినపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో గురుపూర్ణిమ వేడుకల ఘనంగా నిర్వహించారు.

కొండపి(సింగరాయకొండ): కొండపిలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున పంచామృతాలతో అభిషేకాలు, సాయి నామ కీర్తనలు ఆలపించారు. సాయి భక్తుల ఆధ్వర్యంలో భరత నాట్యం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అద్దేపల్లి శ్రీను ఆధ్వర్యంలో ఐదు వేల మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెం, ఆలకూరపాడు కాకుటూరివారిపాలెం, టంగుటూరులోని సాయి మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఆలయ కమిటీలు, దాతల ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేశారు.



సింగరాయకొండ సాయిమందిర్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు



రామాయపట్నం తీరంలో భక్తులు సందడి



బాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



పామూరు: విశిష్ట అలంకరణతో సాయిబాబా మూల విగ్రహమూర్తి



ఉలవపాడులో సాయిబాబాకు పూజలు



మొగళ్లూరు సాయిబాబా మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు



నందనమారెళ్ల ఆలయంలో పూజలు



కొండపిలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదనం అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌శర్మల వేదమంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పూజాహాలులో అర్చకులు గోపూజ నిర్వహించారు. ఉదయం నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవ మూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భజంత్రీల మేళతాళాలనడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

Suit Summons under Order V Rule 1 of C.P.C

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : : KANDUKUR

O.S.NO. 76/2011

Avula Ankireddy and 3 others ....Plaintiffs

Vs.

Avula Ankamma (died) and 12 others ....Defendants

To,
Choda Ravichandra Reddy (D11)
S/o Chandra Sekhara Reddy R/o Jangamvaripalli village H/o Arivemula, Chandrasekharapuram Mandal, Prakasam Dist.

Sir.

Whereas the above Plaintiff filed above numbered suit against the defendants 1 to 8 only first, and subsequently the plaintiffs impleaded you and 4 others and added the said other 5 defendants including you, but you are added as 11th defendant in the above said suit and the same is posted to 01.08.2024 for your notice. Hence you are here by directed to take this notice to appear before the above said Hon'ble court on the above said date i.e **01.08.2024 at 10.30 A M** either in person by you or through your pleader and state your objections if any on the above suit, otherwise the Hon'ble court will be decide the above suit against you on exparte.

K.V.Lakshmi Narayana
Advocate for the Plaintiffs

పుస్తక పఠనంతో విజ్ఞానం

టంగుటూరు:

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ నిర్వహకుడు వర్ధనరాజు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ..పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



టంగుటూరులో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పేకాట స్థావరాలపై దాడులు

పుల్లలచెరువు: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు. పుల్లలచెరువు, శతకోడు, ఐటీ వరం గ్రామాల్లో మెరుపుదాడులు చేసి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాటాడుతుండగా, అదుపులోకి తీసుకున్న వారిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.